# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-4 14, అక్టోబరు, 2014

తెలంగాణ డ్రింకింగ్ వాటర్ గ్రిడ్ పనుల సర్వే కోసం రూ. 105 కోట్లను విడుదల చేశారు. సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేసి ఒకేసారి సమాంతరంగా గ్రిడ్‌కు సంబంధించిన అన్ని పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం తెలంగాణ డ్రింకింగ్ వాటర్ గ్రిడ్ పథకంపై అధికారులు రూపొందించిన ప్రాథమిక నివేదికను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే కోసం అయ్యే 105 కోట్ల రూపాయలను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి డా.టి.రాజయ్య, పంచాయతిరాజ్ శాఖ మంత్రి కె.తారకరామారావు, ఎంపి బాల్క సుమన్, ప్రభుత్వ సలహాదారు కెవి.రమణాచారి, ప్రభుత్వ కార్యదర్శులు నాగిరెడ్డి, రేమాండ్ పీటర్, నర్సింగ్‌రావు, ప్రదీప్ చంద్ర, తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. తెలంగాణలోని ప్రతి ఇంటికి నల్లాల ద్వారా మంచినీరు అందించే బృహత్తర కార్యక్రమం చేపట్టామని, ప్రభుత్వానికి ఈ కార్యక్రమం అత్యంత ప్రాధాన్యత గల అంశమని చెప్పారు. జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్,పాలేరు, కిన్నెరసాని, వైరా, రామప్ప, ఎల్ఎండి, ఎంఎండి, కడెం, ఎల్లంపల్లి, కొమురం భీం, ఎస్ఆర్ఎస్‌పి, గడ్డెన్న , నిజాం సాగర్, మంజీర తదితర ప్రాజెక్టుల నుండి నీటిని తీసుకొని పైపులైన్ల ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని 25 వేల జనావాస ప్రాంతాలకు మంచినీరు అందించాలని ముఖ్యమంత్రి చెప్పారు. లక్ష 32 వేల కిలోమీటర్ల పొడవైన పైపులైను అవసరమైనందున ఇప్పుడే ఏ రకం పైపులైను ఎంత కావాలనే విషయంపై అంచనాలు రూపొందించి టెండర్లు పిలిచి వర్క్ ఆర్డర్ ఇవ్వాలని ఆదేశించారు. పైపులు కూడా తెలంగాణలోనే తయారయ్యేలా కంపెనీలను ఒప్పించాలని, దీనివల్ల రవాణా సులువు అవుతుందని, తెలంగాణ రాష్ట్రం పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చెందుతుంది అని అన్నారు. ఫ్యాక్టరీల ఏర్పాటుకు అవసరమయ్యే సహాయ సహకారాలు ఇస్తామని చెప్పారు. పైపులైన్లు గ్రామాలకు తరలిస్తూనే మరోవైపు ఎక్కడికక్కడ కరెంట్ మోటార్లను బిగించాలని చెప్పారు. గ్రిడ్ పనుల

కోసం కరెంట్ కూడా బాగా అవసరం అవుతుంది కాబట్టి దానికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా విద్యుత్ శాఖకు పంపాలని, ఎక్కడ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలనే విషయంపై కూడా అంచనాలు రూపొందించాలన్నారు. ఇంటేక్ వద్ద, నీటిని శుద్ధి చేసే ప్లాంట్ల వద్ద సబ్ స్టేషన్లు నిర్మించాలని సూచించారు. నీటి పారుదల ప్రాజెక్టుల్లో 10 శాతం నీటిని మంచినీటి కోసం కేటాయించాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకున్నందున నీటి పారుదల శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రిడ్ కోసం నిర్మించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల బాధ్యతలు కూడా నీటి పారుదల శాఖకు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. వేల కోట్ల రూపాయల వ్యయంతో చరిత్రలో నిలిచిపోయే విధంగా గ్రిడ్ ఏర్పాటు చేస్తున్నందున నాణ్యత విషయంలో రాజీ పడవద్దని చెప్పారు. నాణ్యత పరిశీలన కోసం సిఇ స్థాయి అధికారి నేతృత్వంలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలని సూచించారు. పైపులైన్లు, మోటార్లు, ఇతర సామాగ్రి కొనుగోలు నుండి పనితీరు వరకు ప్రతి ప్రక్రియలో నాణ్యత పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. పైపులు, మోటార్లు కొనుగోలు చేయడానికి నాణ్యతా ప్రమాణాలు పాటించే కంపెనీలను సంప్రదించాలని చెప్పారు. గ్రిడ్ నిర్మాణం నుంచి నిర్వహణ వరకు అన్ని బాధ్యతలు గ్రామీణ మంచినీటి సరఫరా వ్యవస్థ అధికారులే (ఆర్‌డబ్ల్యుఎస్) చూసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం వున్న పైపులైన్లు, ట్యాంకులు, ఇతర వసతులను గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. ప్రాజెక్టులు, నీటి వనరుల్లో నీటి లభ్యత ఉన్నప్పుడు అక్కడి నుండి నీటిని తోడి మరో చోట నిలువ చేయాలని చెప్పారు. దీనివల్ల ప్రాజెక్టుల్లో నీరు ఎండిపోయినా మంచినీటికి డోకా ఉండదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం కృష్ణా, గోదావరి బేసిన్లలో చెరీ సగం ఉంది కాబట్టి రెండు నదుల నీళ్లను వాడుకోవాలని చెప్పారు. వరద కాలవల ద్వారా ఎప్పటికప్పుడు చెరువులు నింపుకోవాలని సూచించారు. ఎత్తిపోతల ద్వారా మొత్తం పథకాన్ని నిర్వహించవద్దని, ఎక్కువ శాతం నీటిని ఎతైన కొండలకు ఎక్కించి అక్కడి నుండి గ్రావిటీ ద్వారా గ్రామాలకు పంపాలని సూచించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం